సాక్షి
మంచిర్యాల
బుధవారం । 17 । జూలై । 2024



కొలువు కొట్టాల్సిందే.. 8లో▸
ఈ నెల 18నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,295 ఉపాధ్యాయ ఖాళీలుండగా, 30వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.



ఊరూరా అంగన్‌వాడీ బాట
'అమ్మమాట అంగన్‌వాడీ బాట'లో భాగంగా జిల్లావ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. తల్లిదండ్రులను కలిసిన టీచర్లు చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

డ్రగ్స్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని స్థానిక డీసీపీ భాస్కర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్ (రీహాబిటేషన్ సెంటర్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులతో రీహాబిటేషన్ సెంటర్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలనకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డికి సూచించారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టు విధులు నిర్వహిస్తున్న అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏసీపీ ప్రకాశ్, ఆర్ఎల్వో డాక్టర్ భీష్మ, స్థానిక సీఐ బన్సీలాల్, సిబ్బంది ఉన్నారు.

'వానలతో ఉత్పత్తికి ఆటంకం కలగొద్దు'

శ్రీరాంపూర్: వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగనీయొద్దని సింగరేణి డైరెక్టర్ (పీ.పీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జీవీఆర్, సీఆర్ఆర్ ఓబీ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఓసీపీ అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై మాట్లాడారు. ఈ నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ లక్ష్యాలను సాధించాలని సూచించారు. వర్షాలు వచ్చినప్పుడు ఉత్పత్తికి ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. క్వారీలో వర్షపు నీరు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి, ఓసీపీపీవో టీ శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

19నుంచి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న రవికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాల పంచాయతీ పరిధి ఆర్వీ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 19–21 తేదీల్లో 38వ రాష్ట్ర తైక్వాండో సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్, రిటైర్డ్ సీఐడీ అడిషనల్ ఎస్పీ పీ రవికుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తైక్వాండో జనరల్ సెక్రటరీ జిల్లపల్లి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 19న సాయంత్రం 4గంటలకు క్రీడాపోటీలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, కే శ్రీహరి ప్రారంభిస్తారని తెలిపారు. సబ్ జూనియర్స్, కేడెట్ 12 నుంచి 60 కేజీల విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మంది బాలురు, 400 మంది బాలికలు పాల్గొంటారని తెలిపారు. 21న పోటీల ముగింపు కార్యక్రమానికి బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 27నుంచి 31వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు అమ్జద్, పీడీలు రవి, బలరాం, పీఈటీ రాజ్‌మహ్మద్, ఎండీ చాంద్‌పాషా, క్రీడాకారుడు ఆనంద్ తదితరులున్నారు.

వైద్యశిబిరానికి స్పందన

శ్రీరాంపూర్: ఆర్కే–8 డిస్పెన్సరీలో మంగళవారం సివిల్ కాంట్రాక్ట్ కార్మికుల కోసం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు హాజరు కాగా, వైద్యులు పరీక్షించి అవసరమైనవారికి మందులు ఇచ్చారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, వైద్యులు మురళీధర్, లోక్‌నాథ్‌రెడ్డి, సివిల్ అధికారులు రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

నయవంచకులు..!

- మొన్న చిట్టీల వ్యాపారి.. నిన్న బంగారం వ్యాపారి
- ఆశపడి మోసపోతున్న అమాయక ప్రజలు



మంచిర్యాలక్రైం: నమ్మిన వారిని నట్టేట ముంచి కొందరు నయవంచనకు పాల్పడుతున్నారు. చిట్టీలు, లక్కీ స్కీంలు, ఉద్యోగాలు అంటూ మాయమాటలు చెప్పి.. లాభాల ఆశ చూపి అందినకాడికి దండుకుని అదృశ్యం అవుతున్నారు. బాగా తెలిసిన వ్యక్తులే టోకరా వేస్తుండడంతో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియక బిక్క మొహం వేస్తున్నారు. కొందరు ఎలాంటి అనుమతి లేకుండా రూ.కోట్లలో వడ్డీ వ్యాపారం, చిట్‌ఫండ్స్ నడుపుతూ.. బంగారు దుకాణాలు ఏర్పాటు చేస్తూ.. లక్కీ స్కీంల పేరిట వాయిదా పద్ధతిలో వసూలు చేయడం, రూ.కోట్లలో పోగయ్యే వరకు అందరితో నమ్మకంగా ఉంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ప్రారంభంలో నమ్మకంగానే ఉంటూ కొంతకాలం గడిచాక పెద్దమొత్తంలో డబ్బులు జమ చేసుకుని ఉడాయిస్తున్నారు. గతేడాది మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన చిట్టీల వ్యాపారి రూ.కోటిన్నరతో ఉడాయించాడు. తాజాగా జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ బంగారు నగల దుకాణం వ్యాపారి రూ.10కోట్ల వరకు అప్పులు చేసి కుటుంబ సభ్యులతో పారిపోయాడు. ఈ సంఘటన గతం వారం రోజులుగా చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనల ప్రకారం ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం, బంగారు దుకాణాలు, ఎలాంటి వ్యాపారం చేయాలన్నా ప్రభుత్వ అనుమతి కచ్చితంగా ఉండాలి. ఫైనాన్స్, చిట్టీల నిర్వహణకు ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా లైసెన్స్ పొంది ఉండాలి. అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం, చిట్టీల నిర్వహణ చట్ట విరుద్ధం. వీరు ఇచ్చిన అప్పు చెల్లించకపోయినా అడిగే హక్కు ఉండదు. కానీ, జిల్లాలో కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా రూ.కోట్లలో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. ఇష్టారీతిన వడ్డీ వసూలు చేస్తూ బాధితులను వేధింపులకు గురి చేస్తున్నారు. జిల్లాలో అనుమతి లేకుండా చిట్‌ఫండ్ వ్యాపారం చేస్తున్నారు. మరికొన్ని అనుమతి పొందిన చిట్‌ఫండ్ కంపెనీలు కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా వెలుగులోకి, అధికారుల దృష్టికి రానివి ఎన్నో ఉన్నాయి.

వడ్డీ దందా

చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ కంపెనీలు, హైర్‌పర్చేజ్ నిర్వాహకులు, జువెల్లరీ వ్యాపారులు బంగారం, భూమి పత్రాలు తాకట్టు పెట్టుకుని అవసరమైన వారికి డబ్బులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. అప్పు, ఒప్పంద పత్రాల్లో పూర్తి వివరాలు రాయకుండానే సంతకాలు, ఏటీఎం కార్డు, ఖాళీ చెక్కులు తీసుకుంటున్నారు. అప్పు ఇచ్చిన డబ్బుకు రూ.100కు రూ.5 నుంచి రూ.10వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలాంటి గిరిగిరి ఫైనాన్స్‌లు, చిట్‌ఫండ్స్ నిర్వాహకులు జిల్లా కేంద్రంలో వేలల్లో ఉన్నారు. కొందరు పోలీసుశాఖ, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులూ ఈ వ్యాపారాల్లో భాగస్వాములు కావడం గమనార్హం.

రికవరీకి బౌన్సర్లు

ఇచ్చిన అప్పును రికవరీ చేసుకునేందుకు బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. దేహదారుఢ్యం కలిగిన యువకులను నియమించుకుని కమీషన్‌పై పాత బకాయిలు వసూలు చేయిస్తున్నారు. మొండి బకాయిల వసూలుకు బెదిరించడం, దాడులు చేయడం, ఇళ్లలో విలువైన వస్తువులు స్వాధీనం చేసుకోవడం వీరి విధి.

జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు..

- ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ జువెల్లరీ వ్యాపారి తన స్నేహితులు, దుకాణానికి వచ్చే వినియోగదారులకు దుకాణాన్ని చూపిస్తూ నమ్మించాడు. సుమారు రూ. 10కోట్ల వరకు అప్పులు చేసి బంగారు నగలతో ఉడాయించాడు. బాధితులు కొందరు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.
- జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి విజయ్‌కుమార్ 2016 నుంచి 2022 వరకు చిట్టీలు బాగానే నిర్వహించాడు. చాలా నమ్మకంగా నడిపాడు. మంచిర్యాల, ఆర్కేపీ, శ్రీరాంపూర్, సీసీసీ నస్పూర్ ప్రాంతాలకు చెందిన సుమారు 50మంది సభ్యులుగా చేరారు. కొంతకాలం తర్వాత చిట్టీలు ఎత్తిన వారికి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తూ రూ.1.50 కోట్లతో 2023 జనవరి నుంచి అదృశ్యమయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అతడిని జైలుకు పంపించారు.
- జన్నారం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు మేదరిపేటకు చెందిన మరోవ్యక్తితో కలిసి జల్సాలకు అలవాటుపడ్డాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు 40మంది నిరుద్యోగుల వద్ద రూ.1.50కోట్లు వసూలు చేసి చేతులెత్తేశాడు. ఈ ఘటన 2022 నవంబర్ 14న వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.
- జిల్లా కేంద్రానికి చెందిన ఓ చిరు వ్యాపారి కరీంనగర్‌కు చెందిన చిట్‌ఫండ్‌లో కొంత లోన్ తీసుకున్నాడు. లోన్ చెల్లింపులో కొంత ఆలస్యం కావడంతో రికవరీ బృందం రాత్రి మద్యంమత్తులో ఫోన్ చేసి దుర్భాషలాడుతూ ఇంటి మహిళలను కూడా అసభ్యకర పదజాలంతో దూషించాడు. నెలవారీ వాయిదా కట్టాలని, లేనిపక్షంలో ఇంటికి వచ్చి రచ్చ చేస్తామని బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బదిలీల సందడి!

- జిల్లాలో తుది దశకు చేరిన ప్రక్రియ
- నాలుగేళ్లు దాటినవారికి తప్పనిసరి
- రెండేళ్లు దాటిన వారికీ అవకాశం?
- జిల్లాలో 1,219 మంది ఉద్యోగులు
- దరఖాస్తు చేసినవారు 727 మంది
- ఈ నెల 20లోపు ఉత్తర్వులు జారీ



కలెక్టరేట్ భవన సముదాయం

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. జిల్లాలోని 37 ప్రభుత్వ శాఖల నుంచి రెండేళ్లు, నాలుగేళ్ల సర్వీస్, స్పౌజ్‌కు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఏయే ప్రాంతాలకు బదిలీలు కావాలనే దానిపై ఆప్షన్లు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా శాఖల పరిధిలో ఈ బదిలీల ప్రక్రియ ఈ నెల 20వ తేదీతో పూర్తి చేయనున్నారు. జిల్లాలో 37 ప్రభుత్వ శాఖల్లో 1,219 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు 515 మంది ఉండగా, వీరంతా తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఇక రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి కూడా బదిలీ అయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించగా, 180 మంది దరఖాస్తు చేశారు. భార్యాభర్తలు ఉద్యోగులుగా పనిచేస్తున్న సమయంలో ఒకరిని (స్పౌజ్) మాత్రమే బదిలీ చేయనుండగా, జిల్లా నుంచి స్పౌజ్ కేటగిరిలో 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. నాలుగో తరగతి ఉద్యోగి నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు జిల్లాస్థాయిలో, సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్, ఆపై క్యాడర్ అధికారులు జోనల్ స్థాయిలో, జిల్లా స్థాయి అధికారులను మల్టీ జోనల్ స్థాయిలో మూడు విభాగాల్లో బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయనుండగా, ఏడాదిలోపు ఉద్యోగ విరమణ చేసే వారికి మాత్రం మినహాయింపు ఇస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి జోనల్, మల్టీజోనల్ స్థాయి బదిలీల ప్రక్రియ మొత్తం ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయనున్నారు.

నిబంధనల మేరకే..

ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే చేపట్టనున్నారు. ప్రతీ డిపార్ట్‌మెంట్‌లో 40 శాతం మంది ఆఫీసర్లు, ఉద్యోగులు మాత్రమే బదిలీ కానున్నారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లోని ఉద్యోగుల బదిలీ 40 శాతం జరగకపోతే రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి అవకాశం కల్పించనున్నారు. జిల్లాస్థాయి, జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో బదిలీలు జరుగుతుండగా, వారు కోరుకున్న స్థానాలకే బదిలీ అయ్యేందుకు ఉద్యోగులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. 317 జీవోతో పాటు ఇతర కారణాలతో వారి సొంత జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి పనిచేస్తున్నవారు తిరిగి సొంత జిల్లాలకు వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

బదిలీల కోసం చేసుకున్న ఉద్యోగుల దరఖాస్తులను ఈ నెల 13నుంచి 18వ తేదీ వరకు పరిశీలించి, మాస్టర్ లిస్టును తయారు చేసి, 19, 20 తేదీల్లో బదిలీ ఉత్తర్వులు అందజేయనున్నారు. బదిలీ అయినవారు రిలీవ్ అయ్యాక, వారికి వచ్చిన పోస్టింగులో మూడు రోజుల్లోపు చేరాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి బదిలీ కాకుండా ఉండిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనలతో బదిలీ కాక తప్పదు. ఒకేసారి అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ జరుగుతుండడంతో, ఎవరెవరు ఏయే ప్రాంతాలకు వెళ్తారనేది ఈ నెల 20వ తేదీలోపు తెలియనుంది.

నాలుగేళ్లు, రెండేళ్ల సర్వీస్, స్పౌజ్ కింద బదిలీలకు ఆప్షన్ పెట్టుకున్న ఉద్యోగుల వివరాలు..

శాఖ	నాలుగేళ్లు	రెండేళ్లు	స్పౌజ్
ట్రైబల్ వెల్ఫేర్	22	21	1
వ్యవసాయశాఖ	20	8	6
విద్యాశాఖ	12	10	0
పంచాయతీరాజ్	31	0	0
కోఆపరేటివ్	14	0	0
ఆడిట్ శాఖ	5	0	0
సర్వే, ల్యాండ్ రికార్డ్స్	13	0	0
పశుసంవర్ధక శాఖ	18	8	2
ప్రణాళిక (సీపీవో)	19	25	1
మార్కెటింగ్	1	0	0
బీసీ వెల్ఫేర్	6	4	0
వైద్యారోగ్యశాఖ	24	13	0
ప్రొహిబిషన్, ఎక్సైజ్	51	12	5
ట్రెజరరీ, అకౌంట్స్	21	29	2
పంచాయతీరాజ్ ఇంజినీర్	3	0	0
డీసీహెచ్ఎస్			
టీవీవీపీ(మెడికల్, హెల్త్)	3	0	0
ఎస్సీ కార్పొరేషన్ (ఈడీ)	1	0	0
ఉద్యానవనం, సెరికల్చర్	12	0	0
పరిశ్రమల శాఖ	4	2	0
ఫిషరీస్ ఆఫీస్	1	1	0
ఇరిగేషన్, చీఫ్ ఇంజినీర్	14	1	0
మందమర్రి మున్సిపాలిటీ	12	3	2
చెన్నూరు మున్సిపాలిటీ	0	2	0
ఇంటర్ విద్య	9	5	0
ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	4	4	0
ఎంప్లాయ్‌మెంట్ డిపార్ట్‌మెంట్	3	3	0
ఐ అండ్ పీఆర్	2	1	0
జిల్లా వైద్యారోగ్యశాఖ	22	9	0
కార్మికశాఖ	2	6	0
జెడ్పీ	108	0	1
రెవెన్యూ శాఖ	42	13	12
మొత్తం	515	180	32

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో సీజనల్, కీటకజనిత వ్యాధులు, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి అనిత ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక వైద్య నిపుణులు, ఎండీ ఫిజీషియన్లు, 23 ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రులకు వచ్చే జ్వర బాధితుల వివరాలు రిజిష్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రతీరోజు వివరాలను జిల్లా కార్యాలయంలో అందించాలని సూచించారు. డెంగీపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, టీ డయాగ్నోస్టిక్ హబ్‌లలో ఎలిసా పరీక్ష నిర్వహించిన తర్వాతే డెంగీ నిర్ధారణ చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 ప్రకారం అన్ని పరికరాలు, సౌకర్యాలు ఉండేలా, నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించారు. వైద్యులు, రుసుము, సేవల వివరాలను అందరికీ తెలిసేలా ఆస్పత్రిలో ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చూడాలని పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అర్థమయ్యేలా పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నా.. చేసినా.. ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. సమావేశంలో మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, డీడీఎం ప్రవళ్లిక తదితరులున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



యూనిట్–2లో పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

జైపూర్: 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లోగల యూనిట్–2లో కొనసాగుతున్న క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు త్వరగా పూర్తి చేసి రెండో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్–2లో కొనసాగుతున్న ఓవర్‌హాలింగ్ పనులను పరిశీలించారు. యూనిట్–2లో బాయిలర్, టర్బైన్ జనరేటర్‌తో పాటు బీవోపీలోగల ప్రధాన విభాగాల్లో చేపడుతున్న పనులు, ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల వివరాలు అధికారులు ఆయనకు వివరించారు. ఓవర్‌హాలింగ్ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తగిన సూచనలను ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు వివరించారు. పనుల్లో పాల్గొంటున్న ఇంజినీర్లు, ఉద్యోగులను ఉత్తేజపరుస్తూ వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తంజేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసుకుని రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఎస్టీపీపీ వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం శ్రీనివాసులు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఏజీఎంలు ఎస్ఎన్ ప్రసాద్, రమణ, మధన్‌మోహన్, బాయిలర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎస్వోటూ సీటీసీ ప్రభాకర్‌రావు, ఇతర అధికారులున్నారు.

తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపినా, అర్ధరాత్రి సరైన కారణం లేకుండా వాహనాలతో రోడ్ల మీదకు వచ్చినా కఠినచర్యలు తప్పవని డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి 11నుంచి 2గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు డీసీపీ ఆధ్వర్యంలో స్థానిక ఏసీపీ ప్రకాశ్, స్థానిక సీఐ బన్సీలాల్, ఐదుగురు ఎస్సైలు, 30మంది సిబ్బందితో కలిసి జిల్లా కేంద్రంలోని ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా, ముఖరాం చౌరస్తా, ఏసీసీ చౌరస్తా, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, కాలేజీరోడ్‌లో ఏకకాలంలో మూడు గంటల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హడలెత్తించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న, నమ్మదగిన కారణం లేకుండా రోడ్లపైకి వచ్చిన వారిపై కొరడా ఝులిపించారు. ఐదు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి కారణం లేకుండా రోడ్ల మీదకు వచ్చిన వాహనాల పత్రాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని, కారణం లేకుండా రోడ్లమీదకు వచ్చినా, నంబర్ ప్లేట్ లేని 35 వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సుమారు 50మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి ఆధార్, గుర్తింపు కార్డుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో రాత్రి పూట నిరంతరంగా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు.

కొత్త రైళ్లు పట్టాలెక్కేనా?

- 'ఏ' గ్రేడ్ రైల్వేస్టేషన్‌పై నిర్లక్ష్యమేలా?
- ఇంటర్‌సిటీ తర్వాత కొత్త రైలు రాలె
- తరచూ రద్దవుతున్న ప్రస్తుత ట్రైన్‌లు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఇద్దరు కొత్త ఎంపీలపైనే కోటి ఆశలు



మంచిర్యాల రైల్వేస్టేషన్

మంచిర్యాలఅర్బన్: కొన్నేళ్లుగా ఆశ పెడుతున్న కొత్త రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కడంలేదు. మంచిర్యాల రైల్వేస్టేషన్ మీదుగా కాజీపేట్–కాగజ్‌నగర్ మార్గంలో 12 ఏళ్ల కిందటి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మినహా ఇప్పటిదాకా మరో కొత్త రైలు కూత వినబడలేదు. ఉన్న రైళ్లను కూడా తరచూ రద్దు చేస్తుండడంతో ఈ ప్రాంత ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌పై నిరీక్షిస్తున్నారు. 18వ లోకసభ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఆదిలాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ ఎన్నికయ్యారు. ప్రత్యేక చొరవ చూపి బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా వీరు కృషి చేస్తారని ప్రయాణికులు గంపెడాశతో ఉన్నారు.

ఇవి మిస్సయితే బస్సు ప్రయాణమే..

సరిపడా ప్యాసింజర్ రైళ్లు లేక మంచిర్యాల ప్రాంత ప్రయాణికులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఉదయం 4.30కి భాగ్యనగర్ రైలు, మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటర్‌సిటీ, సాయంత్రం 3.30కి రామగిరి ప్యాసింజర్ రైళ్లు మినహాయిస్తే మరో ట్రైన్ లేకుండా పోయింది. ఒకవేళ ఇవి మిస్సయితే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. సింగరేణి కార్మికులు చాలామంది పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన వారు కావటంతో తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. హైదరాబాద్‌లో చదివే విద్యార్థుల్లో ఈ ప్రాంతంవారే ఎక్కువగా ఉన్నారు. ప్రయాణికుల రద్దీకి సరిపడా రైళ్లు నడపాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నా సంబంధిత శాఖ నెరవేర్చడంలేదు.

పెరుగుతున్న డిమాండ్

సికింద్రాబాద్–కాజీపేట్–కాగజ్‌నగర్ రైల్వేమార్గంలో పలు రైళ్ల నిలుపుదలతో పాటు కొత్త రైళ్ల డిమాండ్ పెరుగుతోంది. రద్దీకి అనుగుణంగా ప్రస్తుత రైళ్లకు అదనంగా మరో రెండు రైళ్లు నడిపించాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈప్రాంతం నుంచి దైవదర్శనానికి తిరుపతికి వెళ్లే భక్తుల సంఖ్య ఎక్కువే. వీరు నెలన్నర ముందే రిజర్వేషన్ చేసుకోవాల్సి వస్తోంది. శని, ఆదివారాల్లో వెళ్లాలంటే మూడు నెలల ముందు రిజర్వేషన్ చేసుకోక తప్పదు. ఇలాంటి తరుణంలో కాగజ్‌నగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు వేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. బల్లార్షా నుంచి కాజీపేట్ వరకు నడిచిన ఎక్స్‌ప్రెస్ రైలును పునఃప్రారంభించి హైదరాబాద్‌కు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. పొరుగునే ఉన్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిపినన్ని రైళ్లను మంచిర్యాలలో నిలుపకపోవటంపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. హంసఫర్, జైపూర్, ఏపీ ఎక్స్‌ప్రెస్‌లు మంచిర్యాలలో నిలిపితే ఈప్రాంత ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

'ఏ' గ్రేడ్ గుర్తింపు ఉన్నా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే 'ఏ' గ్రేడ్ రైల్వేస్టేషన్‌గా మంచిర్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ స్టేషన్ మీదుగా రోజుకు దాదాపు 15వేల మంది ప్రయాణిస్తుంటారు. రైల్వే శాఖకు రూ.4లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. మంచిర్యాలలో నిలుస్తున్న రైళ్ల సంఖ్య 20లోపే. ఇందులో కొన్ని రైళ్లను ఇప్పటికే అధికారులు రద్దు చేశారు. అప్పటి యూపీఏ హయాంలో వచ్చిన ఇంటర్‌సిటీ, పుష్‌పుల్ లాంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేట్–బల్లార్షా మార్గంలో ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకోవైపు కాజీపేట్ నుంచి నాగపూర్‌కు వెళ్లే అజ్నీ రైలును రద్దుచేశారు. ఏడాదిగా కరీంనగర్–సిర్పూర్ మధ్య రాకపోకలు సాగించే పుష్‌పుల్ రైలును నిలిపివేశారు. ఈ మార్గంలో 80శాతం మూడోలైన్ విద్యుదీకరణ పనులు పూర్తయినా నూతన రైళ్ల ఊసే లేకుండా పోయింది.

ప్యాసింజర్ రైళ్ల రద్దు సరికాదు



రోలింగ్ కారిడార్ బ్లాక్ పేరిట కేవలం పుష్‌పుల్, ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు లేని రోలింగ్ కారిడార్ బ్లాక్ ప్యాసింజర్ రైళ్లకు ఎందుకో తెలియడంలేదు. బోధన్–కరీంనగర్–సిర్పూర్ టౌన్ ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్ రెండు నెలలుగా రద్దవుతూనే ఉంది. అజ్నీ రైలును నిలిపివేశారు. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరిస్తూ కొత్త రైళ్ల కోసం ఎంపీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– ఫణి, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు

కొలువు కొట్టాల్సిందే...!

- వ్యూహం అనుసరిస్తే విజయం మనదే...
- ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి 30వేల దరఖాస్తులు
- ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు
- తీవ్ర పోటీ, ఒత్తిడి నడుమ పరీక్షలకు అభ్యర్థులు
- ప్రణాళికతో చదివితే కొలువు సులువేనంటున్న నిపుణులు


నిర్మల్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో సిద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ఉపాధ్యాయ ఖాళీలు, అందిన దరఖాస్తులు

జిల్లా	ఖాళీలు	దరఖాస్తులు
నిర్మల్	342	6,035
ఆదిలాబాద్	324	9,569
మంచిర్యాల	288	8,262
ఆసిఫాబాద్	341	5,677
మొత్తం	1,295	29,543

నిర్మల్‌ఖిల్లా: కొన్నేళ్లుగా నిరంతరం పుస్తకాలతోనే కుస్తీ పడుతూ శ్రమిస్తున్న నిరుద్యోగుల చిరకాల స్వప్నం ఉపాధ్యాయ ఉద్యోగం. ఈ కలను సాకారం చేసుకునే తరుణం రానేవచ్చింది. నిరుద్యోగులు ఎంతగానో ఎదురుచూస్తున్న డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఒకవైపు పరీక్షలు వాయిదా వేయాలంటూ కొంతమంది అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా...పరీక్షలు నిర్వహించడానికే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఇప్పటికే హాల్ టికెట్లను కూడా జారీ చేసింది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటిఫికేషన్ ప్రకారం 1,295 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా దాదాపు 30 వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రెండో నియామక పరీక్ష

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017 జూలైలో మొదటి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడేళ్ల అనంతరం నిర్వహిస్తున్న రెండో నియామక పరీక్ష ఇది. ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించే పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 29,543 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఒక్కో జిల్లా అభ్యర్థులకు ఒక్కోరోజున ఆయా జిల్లాల వారీగా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు విడతలుగా నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో తీవ్ర పోటీ ...

గత ప్రభుత్వం 2023లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయగా అందులో పోస్టుల సంఖ్య తక్కువగా ఉందని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని బీఈడీ, డీఈడీ, తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసుకుని టెట్ అర్హత సాధించిన దాదాపు 30 వేల మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తులు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 9,569, నిర్మల్ జిల్లాలో 6,035, మంచిర్యాల జిల్లాలో 8,262, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5,677 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రిపరేషన్ కోసం మరింత సమయం కేటాయించాలని, మరిన్ని ఖాళీలను జత చేసిన అనంతరమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు పరీక్షలు కచ్చితంగా నిర్వహించి తీరుతామంటూ కృత నిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. ఈ నెల 18 నుంచి జిల్లాల వారీగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. హాల్‌టికెట్లు కూడా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దాని ప్రకారం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ వివిధ సబ్జెక్టులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, నల్గొండ, తదితర ప్రాంతాలకు పరీక్షల సమయంలో అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పరీక్షకు ఒక రోజు ముందు ఇలా...

- ఒకరోజు ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అభ్యర్థులు ముందు రోజున ప్రిపరేషన్ కంటే కూడా పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి.
- ముందు రోజు రాత్రి అభ్యర్థులు ప్రశాంతంగా నిద్రపోవాలి. పరీక్ష రోజున నిర్దేశిత సమయానికంటే ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. కేటాయించిన స్థలం, కంప్యూటర్ పనితీరు సరిచూసుకుని కూర్చున్న తర్వాత ఇచ్చిన సూచనలకనుగుణంగా ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- తెలిసిన సమాధానాలు గుర్తించిన తర్వాతే ఎలిమినేషన్ విధానం ద్వారా సమాధానం ఊహించి మిగతా ప్రశ్నలకు జవాబులను గుర్తించాలి. టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండనుండడంతో 80 మార్కులకు డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నారు. ఒక్కో ప్రశ్నకు అరమార్కు చొప్పున 160 ప్రశ్నలుంటాయి.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత...

ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,295 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లోని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారు. ఇటీవల నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియతో జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఈ డీఎస్సీ ద్వారా ఎంపికయ్యే ఉపాధ్యాయులను వాటిలో భర్తీ చేయడం ద్వారా కొరత తీరనుంది.

ఒత్తిడికి గురికావొద్దు...



డీఎస్సీ పరీక్షలో ప్రతిప్రశ్న కూడా అత్యంత విలువైనదే. భవిష్యత్‌ను నిర్దేశించే విధంగా ఉంటుంది. కాబట్టి ప్రతీ ప్రశ్నకు అత్యంత జాగ్రత్తగా సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా సమాధానాలు రాబట్టాలి. తెలియని ప్రశ్న వద్ద ఆగిపోకుండా దానిని వదిలేసి ముందుకెళ్లాలి. ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోయినా ఆందోళనకు గురికాకుండా మిగతా వాటికి సమాధానాలు గుర్తించాలి.
– కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోటీ పరీక్షల నిపుణులు, నిర్మల్

కొలువు సులువు..



పరీక్ష సమయంలో ప్రశాంతంగా ఉండాలి. చదివిన అంశాలన్నీ గుర్తుండాలంటే ఒత్తిడికి లోను కాకుండా ఒక్కో ప్రశ్నకు సమాధానాన్ని చాలా రిలాక్స్‌డ్‌గా గుర్తించాలి. ప్రశ్నను చదివిన వెంటనే తొలిసారిగా మనసులో మెదిలే సమాధానమే కరెక్ట్. ప్రణాళికాబద్ధంగా అసందిగ్ధతకు తావులేకుండా ప్రశ్నలకు సమాధానాలను గుర్తిస్తూ పోతే లక్ష్యానికి చేరువవుతాం. అనుకున్న ఉపాధ్యాయ కొలువు సులువుగా చేజిక్కుతుంది.
– శింథే దత్తాద్రి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, 2017 టీఆర్టీ ఉమ్మడి జిల్లా టాపర్, భైంసా

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శివకుమార్ వర్మ (ఫైల్)

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మరౌత్ శివకుమార్ వర్మ (34) తన స్నేహితులైన ఆదిలాబాద్ జిల్లా గోరటికల్‌కు చెందిన బర్దలాల్ శివకుమార్, నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌కు చెందిన కన్నుల అరుణ్, ముచ్చర్ల గ్రామానికి చెందిన సాయిరెడ్డిలతో కలిసి నాలుగు రోజుల క్రితం గోవా వెళ్లాడు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుని మేడ్చల్‌లో ఉండే తన బంధువుల ఇంటికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. మంగళవారం వేకువ జామున 3.30 గంటల సమయంలో కారులో ముగ్గురు స్నేహితులతో పాటు బంధువు ఇంట్లో ఉన్న భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు అరణ్యలను తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. శివకుమార్ వర్మ కారును నడిపిస్తూ శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు సగభాగం లారీ కిందికి చొచ్చుకుపోయి నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న శివకుమార్ వర్మ అక్కడికక్కడే మృతి చెందగా.. అతని భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు అరణ్య, స్నేహితులైన అరుణ్, సాయిరెడ్డి, బి.శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద మంగళవారం తృటిలో ప్రమాదం తప్పింది. రూరల్ ఎస్సై సాయి కుమార్ కథనం ప్రకారం... భైంసా నుంచి నిర్మల్ వైపు లోడుతో వస్తున్న లారీ మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బ్రిడ్జి పైన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై లారీ నుండి కిందికి దూకేశారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్ సహాయంతో లారీని తీసి పక్కకు జరిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుండి రూ.53,180 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కడెం: చిట్యాల్ గ్రామ శివారులోని మామిడితోటలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగదును సీజ్‌చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రమేశ్


నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మందమర్రి పట్టణానికి చెందిన అకారం రమేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ ఆదేశాలు జారీ చేయగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. తన సేవలను గుర్తించి పదవి అప్పగించిన ప్రీతమ్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతుల కోసం కృషి చేయాలి


మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్: ఆర్కే7 గని ఫారెస్టు లీజు అనుమతులకు కోసం గెలిచిన కార్మిక సంఘం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. మంగళవారం ఆర్కే7 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్కే7 గనికి ఫారెస్టు అనుమతుల్లో జాప్యానికి కారకులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రానికి రూ.వేల కోట్ల రాయల్టీలు కడుతున్న సింగరేణికి అనుమతులు ఇవ్వడంలో కేంద్రం జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ నాయకులు గుల్ల బాలాజీ, కస్తూర్తి చంద్రశేఖర్, ఎం.శ్రీధర్, సమ్మయ్య, నవీన్, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ టు సూరత్‌కు గంజాయి

మంచిర్యాలక్రైం: రైలుమార్గం గుండా విజయవాడ టు సూరత్‌కు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.6,08,500 విలువైన 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న రాత్రి రైల్వే స్టేషన్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై మూడుబ్యాగులు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ఒకరు తప్పించుకుని పారిపోయారు. మిగతా ఒకరిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా 24 కిలోల గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన రామ్ చంద్రస్వైన్, కన్హ బాలాజి విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఒకరి వద్ద కొనుగోలు చేసి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో సూరత్‌కు బయలుదేరారు. కొంతదూరం ప్రయాణించాక మార్గమధ్యలో పోలీసులను చూసి భయపడి మరో ట్రైన్‌లో వెళ్లేందుకు ఈ నెల 15న రాత్రి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో దిగారు. జీఆర్పీ పోలీసులు రామ్ చంద్ర స్వైన్‌ను పట్టుకోగా కన్హ బాలాజి స్వైన్ పారిపోయాడు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.


గంజాయితో జీఆర్పీ పోలీసులు

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రిరూరల్: తెలంగాణ రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ బొగ్గు గనుల వేలం విషయంలో కొన్ని కార్మిక సంఘాలు, పార్టీలు తోబూచులాట ఆడుతున్నాయన్నారు. గనులను సింగరేణికి కేటాయించే వరకు అన్ని రాజకీయ పార్టీలు, యూనియన్‌లు ఒక తాటిపైకి రావాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్బీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, హెచ్ఎంఎస్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ట్రాక్టర్ చోరీ నిందితుడి అరెస్ట్

భైంసాటౌన్: ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ఈ నెల 14న మదీనాకాలనీలోని ఓ ఇంటి ముందు ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. దీంతో సోమవారం ట్రాక్టర్ యజమాని మహ్మద్ ఒమర్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా స్థానిక భోకర్ చౌరస్తా వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హత్‌గావ్‌కు చెందిన నిందితుడు నిఖిల్‌రాజును అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కేసును 24గంటల్లో ఛేదించిన సీఐ రాజారెడ్డి, ఎస్సైలు షరీఫ్, గౌసుద్దీన్, సిబ్బందిని ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్ అభినందిచారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

భైంసారూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కొంద్ర రామ్‌కుమార్ (27) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పురుగుల మందుతాగి ఒకరు..

కడెం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన పందిరి గంగారాం (27)మద్యానికి బానిస కావడంతో ఈ నెల 10న అతని తల్లి, భార్య మందలించారు. దీంతో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో ముందుగా ఖానాపూర్, అక్కడి నుంచి నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఈ నెల15న రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సదరం స్లాటు ఎప్పుడైనా చేసుకోవచ్చు

- దివ్యాంగులకు వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం

దండేపల్లి: దివ్యాంగుల వైకల్యం నిర్ధారించేందుకు మొదట సదరం స్లాటు బుక్ చేసుకుని ఆతర్వాత సదరం క్యాంపునకు హాజరు కావాల్సి ఉంటుంది. ఏ రోజైతే స్లాట్ విడుదల చేస్తారో అదేరోజు స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్స్ తక్కువగా విడుదల చేయడంతో స్లాట్ బుకింగ్ దొరకక చాలామంది సదరం స్లాట్ కోసం రోజుల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేంది. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు సదరం క్యాంపు స్లాట్ బుకింగ్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. సదరం కోసం మీసేవ ద్వారా ఎప్పుడైన స్లాట్ బుక్ చేసుకునే వెసులు బాటును కల్పించింది.

ఇదివరకు ఎలా ఉండేదంటే..

సదరం శిబిరానికి సంబంధించిన తేదీలను గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రతీనెల ఖారారు చేస్తారు. నెల ప్రారంభం కాగానే మూడు, నాలుగు రోజుల్లో శిబిరాలు నిర్వహిస్తారు. అధికారులు, వైద్యుల తేదీలు ఖరారు కాగానే ఒకరోజు ముందుగా స్లాట్ నమోదుకు దివ్యాంగులకు అవకాశం ఇచ్చేవారు. పరిమిత సంఖ్యలో స్లాట్లు విడుదల చేయడంతో దివ్యాంగులు తెల్లవారు జామునుంచే మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరేవారు. ఒక్కోసారి సర్వర్ సమస్యలు తలెత్తేవి. స్లాట్ల సంఖ్యకు మించి నమోదు చేసేవారు. సమయం తక్కువగా ఉండడంతో అందరికీ దొరికేవి కావు. దొరకని వారంతా మళ్లీ స్లాట్ కేటాయించేదాకా ఎదురు చూసేవారు. ఇలాంటి కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వం సులువైన విధానాన్ని ప్రవేశపెట్టింది.

కొత్త విధానంలో స్లాట్ కేటాయింపు ఇలా..

స్లాట్ పొందేందుకు మీసేవ కేంద్రంలో ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. సదరం క్యాంపు తేదీ, సమయం, సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఆ తేదీలో క్యాంపునకు వెళ్లాలి. సదరం క్యాంపులో వైద్యులు పరీక్షించి, వైకల్యం నిర్ధారించి, ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. సదరం రెన్యూవల్‌కు కూడా స్లాట్ బుక్ చేసుకోవాల్సిందే.


మీసేవ కేంద్రం..

శిబిరాల సంఖ్య పెరిగింది

గతంలో నెలలో ఒక్కో కేటగిరికి ఒక్కో శిబిరం నిర్వహించేవారు. ఇప్పుడు స్లాట్ల సంఖ్య పెంచడంతో పాటు, శిబిరాల సంఖ్య పెంచడం జరిగింది. వచ్చే సెప్టెంబర్ వరకు డిమాండ్‌ను బట్టి ఆర్థోకు సంబంధించి, 4, దృష్టిలోపం గల వారి కోసం 2, చెవిటి వారికోసం 2, మానసిక వికలాంగుల కోసం 1 చొప్పున సదరం క్యాంపులు నిర్వహిస్తున్నాం. దీంతో సదరం కోసం దివ్యాంగులు ఎప్పుడైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. వరుస సంఖ్యను బట్టి తేదీలు ఖరారవుతాయి.
– రాజేశ్వర్, డీపీఎం, పింఛన్ విభాగం

పంట ముంచుతున్న 5ఆర్ కాలువ

వేమనపల్లి: పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో నిర్మించిన నీల్వాయి ప్రాజెక్టు కాలువలు పంటలకు నష్టం కలుగజేస్తున్నాయి. ఎడమ కాలువ 5ఆర్ వంతెన (వయాడక్ట్)ఇరుకుగా నిర్మించడంతో వందలాది ఎకరాల్లో పంటలకు అపార నష్టం కలుగుతోంది. భారీ వర్షాలు కురిస్తే కొత్తపల్లి వాగు వరద ఉధృతికి ఎంచపాయ వైపు నుంచి 5ఆర్ కాలువ వయాడక్ట్ కింద నుంచి వెళ్తుంటాయి. ఒక దశలో ప్రాణహిత వరద ఎక్కువైన సమయంలో కూడా ఈ వంతెన కింది నుంచే ముంపు నీరు ఎంచపాయను కమ్మేస్తుంది. వయాడక్ట్ వంతెన ఇరుకుగా ఉండటంతో నీరు వెళ్లలేక ఆ ప్రాంతంలో ఉన్న పత్తి, ఫామాయిల్ పంటలు సుమారు 100 ఎకరాల్లో ముంపుకు గురవుతున్నాయి. దీనికి తోడు వయాడక్ట్, 5ఆర్ కాలువ అసంపూర్తిగా వదిలేయడంతో వరద తాకిడి ప్రమాదం ఎక్కువవుతుంది. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇరుకుగా ఉన్న వయాడక్ట్ వంతెన మట్టి బ్యాంకింగ్ చేయకముందే అదనంగా మూడు ఫిల్లర్లు పెంచి వరద సాఫీగా వెళ్లిపోయేలా చూడాలని, లేనిపక్షంలో వేమనపల్లి, బొగుడగూడవాడకు సైతం భవిష్యత్‌లో ముంపు ప్రమాదం ఉండే అవకాశం ఉందని వేడుకుంటున్నారు.


పామాయిల్ తోటలో చేరిన వరద నీరు

సీఎస్సీ నిర్వాహకుడు ప్రశాంత్‌కు అవార్డు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్) నిర్వాహకుడు కొండ ప్రశాంత్ మంగళవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నాడు. సీఎస్సీ 15ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా సీఎస్సీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ సేవలందించిన 30మంది సీఎస్సీల నిర్వాహకులను ఎంపిక చేసి అవార్డు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రశాంత్ ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం. 2019నుంచి 2024వరకు 39,433 డిజిటల్ లిటరసీలో లావాదేవీలు పూర్తి చేయడం ద్వారా అవార్డుకు ఎంపిక చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర అదనపు కార్యదర్శి(అక్షరాస్యత) ఆనంద్‌రావుపాటిల్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సీఎస్సీ సంజయ్‌కుమార్ రాకేశ్ అవార్డు అందజేశారు.



ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రం తరఫున అవార్డు అందుకుంటున్న ప్రశాంత్